అధ్వానంగా సీసీ రోడ్లు

- నిధులు మంజూరైనా పనులు చేపట్టని వైనం
- ఆందోళనలో కొండవాలు ప్రాంత వాసులు


రాంజీ ఎస్టేట్ - 2లో సీసీ రోడ్డు పరిస్థితి ఇలా....


రాంజీ ఎస్టేట్ - 1 కొండవాలు ప్రాంతంలో అధ్వానంగా సీసీ రోడ్డు


కప్పరాడ నుంచి రాంజీ ఎస్టేట్‌కు వెళ్లే సీసీ రోడ్డు దుస్థితి ఇలా...

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, కప్పరాడ కొండవాలు ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నిధులు మంజూరైనా రోడ్లు నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాంజీ ఎస్టేట్ – 1, రాంజీ ఎస్టేట్ – 2 ప్రాంతాల్లో గోతులు పడి రాళ్లు తేలుతుండడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొండవాలు ప్రాంతం కావడం, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై రాళ్లు తేలి గుంతలుగా ఏర్పడడంతో పరిస్థితి మరింత భయానకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటుగా రాకపోకలు చేసే పాదచారులు నడవడానికి కూడా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. కొండవాలు ప్రాంతంలో రాకపోకలంటేనే భయపడుతూ ప్రయాణం చేస్తుంటారు. అలాంటిది రాళ్లు తేలిన రోడ్లపై ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ బ్రేకులు వేస్తే జారి పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు.

అభివృద్ధి కోసమని పార్టీ ఫిరాయించినా...

స్థానిక వార్డు కార్పొరేటర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గత కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచారు. అనంతరం 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో జనసేన పార్టీలోకి జంప్ అయిపోయారు. స్థానికుల మనోభావాలు దెబ్బతీసేలా పార్టీ ఫిరాయించి... వార్డు అభివృద్ధి కోసమే పార్టీ మారినట్లు కవరింగ్ ఇచ్చుకోవడంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. కార్పొరేటర్ చెప్పిందే నమ్ముదామన్నా... రాంజీ ఎస్టేట్, కప్పరాడ కొండవాలు ప్రాంతాల్లో కనీస అభివృద్ధి కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. నిధులు మంజూరైనా స్థానిక ప్రజాప్రతినిధి పనులు చేయించలేకపోయారని విమర్శిస్తున్నారు.

కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో...

నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని స్థానికులు దుయ్యబడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు జీవీఎంసీ నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కొండవాలు ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇదే వార్డులోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించి రాంజీ ఎస్టేట్ – 1, 2, కప్పరాడ ప్రాంతాల్లో నిర్మించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ సీసీ రోడ్ల నిర్మాణానికి మొదటి దశలో సుమారు రూ.15.50 లక్షలు, రెండో దశలో రూ.17 లక్షలు మంజూరైనట్లు ఏఈఈ చాణుక్య తెలిపారు. కొండవాలులో చేపట్టే అభివృద్ధి పనులతో కలిపి త్వరలో సీసీ రోడ్లు నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జీవీఎంసీ ఉన్నతాధికారులు కొండవాలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతల్లో జారి పడుతున్నాం



మా కాలనీలో సీసీ రోడ్లు నిర్మించ లేదు. ఉన్న రోడ్లు రాళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. రాకపోకలు సాగించేటప్పుడు ఆ రోడ్లపై నడవలేకపోతున్నాం. ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. అయినా ప్రజా ప్రతినిధుల జాడ కనిపించడం లేదు. సీసీ రోడ్లు నిర్మించాలని సచివాలయంలో ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. – సీహెచ్ రవి, కంచరపాలెం

కాలనీపై చిన్నచూపు తగదు



వార్డులో అన్ని కాలనీలకు సీసీ రోడ్లు వేశారు. మా రాంజీ ఎస్టేట్ – 1, 2 కాలనీలకు సీసీ రోడ్లు వేయలేదు. గతంలో నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ఆపేశారని అధికారులు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా పనులు ప్రారంభించ లేదు. మా కాలనీపై చిన్న చూపు తగదు. – బి.మూర్తి, రాంజీ ఎస్టేట్

అధికారులు స్పందించాలి



జీవీఎంసీ నిధులు మంజూరు చేసినా సీసీ రోడ్లు నిర్మించలేదు. అధికారులను అడిగితే ఇతర అభివృద్ధి పనులతో కలిపి సీసీ రోడ్లు నిర్మిస్తామని సమాధానం చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ ఉన్నతాధికారులు వార్డులో పర్యటించాలి. సీసీ రోడ్లు నిర్మించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. – బంగారు సురేష్, రాంజీ ఎస్టేట్

ఆదర్శ ఐఏఎస్ అధికారి శంకరన్


మాట్లాడుతున్న ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు

సీతంపేట : భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ కోణంలో అమలు జరిపిన ఆదర్శ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ అని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు అన్నారు. విదసం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం శంకరన్ 90వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ చట్టాలు, సంక్షేమ పథకాల రూపశిల్పి శంకరన్ అని కొనియాడారు. విశ్రాంత పోస్టు మాస్టర్ జనరల్ ముత్యాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఏఎస్ అధికారులకు రోల్ మోడల్ శంకరన్ అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఎన్నో జీవోలు జారీ చేసిన నిజాయతీ గల కార్యనిర్వాహకుడని ప్రశంసించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, రెసిడెన్షియల్ సొసైటీ జిల్లా సమన్వయ అధికారి రూపవతి, హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు మాట్లాడుతూ శంకరన్ నిరాడంబరత, అంకిత భావం అందరికీ ఆదర్శం కావాలన్నారు. విదసం కన్వీనర్ బూసి వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఎంసీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, పౌరహక్కుల సంఘం నాయకులు టి.శ్రీరామమూర్తి, సుజాత, సుధాకర్, ఫ్రాన్సిస్, కస్తూరి తదితరులు శంకరన్‌కు నివాళులర్పించారు. అనంతరం శంకరన్ జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీల విజేతలకు భారత రాజ్యాంగం పుస్తకాలు, ప్రశంసాపత్రాలు బహూకరించారు.

నాటక బంధం పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న సిక్కిం పూర్వ డీజీపీ అత్తిలి సుధాకర్ , తదితరులు

సీతంపేట : నాటక రంగం, జర్నలిజం గురించి భవిష్యత్ తరాలకు తెలియజేసేలా మరిన్ని పుస్తకాలు రావాలని సిక్కిం పూర్వ డీజీపీ అత్తిలి సుధాకర్ అన్నారు. విశాఖ చైతన్య సమితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన సభలో రచయిత బి.వి.అప్పారావు రచించిన 'నాటక బంధం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటక రంగంపై పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. తను నాటక కుటుంబంలో పుట్టానని, తండ్రి అత్తిలి కృష్ణారావు వల్ల నాటక రంగంపై మంచి అవగాహన ఉందన్నారు. ఈ అనుభవం తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడిందన్నారు. తను కూడా 200కుపైగా వీధి నాటకాలు వేశానని, ఆ నాటకాలలో సమాజాన్ని చైతన్యపరిచే మంచి సందేశం ఉండేదని గుర్తు చేశారు. సభాధ్యక్షుడు, ప్రముఖ పాత్రికేయుడు పాత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ బీవీ అప్పారావు రచయిత కాకుండా మంచి నటుడని తెలిపారు. నాటక రంగాన్ని ఎంత మంది ఉన్నత స్థితికి తీసుకెళ్లారో ఈ పుస్తకం ద్వారా తెలుస్తుందన్నారు. పుస్తకంలో 500 మంది నటుల చరిత్ర ఉందని, నాటక రంగంపై పరిశోధన చేయాలనుకునే వారికి ఒక గైడ్‌లా ఉపయోగపడుతుందన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఆనాటి పాత్రికేయులకు క్రమశిక్షణ ఉండేదని, నేడు పెట్టుబడిదారుల చేతుల్లోకి పాత్రికేయ వ్యవస్థ వెళ్లిపోయి దారి తప్పిందన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కళారంగ అభివృద్ధికి ఇటువంటి పుస్తకాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కొణతాల సూర్యనారాయణ, పి.రవి, మేడా మస్తాన్‌రెడ్డి, స్వామి, ఎం.ఎస్.ప్రకాష్, హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కంటి సమస్యలను అశ్రద్ధ చేయొద్దు


విద్యార్థినులకు నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు

సీతమ్మధార : విద్యార్థులు కంటి సమస్యలు అశ్రద్ధ చేయొద్దని విశాఖ నేత్ర వైద్యశాల ట్రస్ట్ క్యాంపు ఆర్గనైజర్ ఈ.సాయికృష్ణ కోరారు. ఈ మేరకు సీతమ్మధార సమీప పీ అండ్ టీ కాలనీ ఎన్ఎంసీహెచ్ పాఠశాలలో మోసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్ను దురద వేసినపుడు చేతితో రుద్దితే కంట్లోకి బ్యాక్టీరియా ప్రవేశించే ప్రమాదముందని హెచ్చరించారు. కళ్లు దురద వేసినపుడు నీటితో కడుక్కోవాలని సూచించారు. కంటి సమస్యలు ఏమున్నా సమీపంలోని నేత్ర వైద్యుడిని సంప్రదించాలన్నారు. కళ్లద్దాలు వాడే విద్యార్థులు విధిగా ఏడాదికోసారి నేత్ర వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఆప్తాలమిస్టులు నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామ్‌ప్రసాద్, ఆప్తాలమిస్టులు కె.నిఖిత, బి.వాసుప్రభ, బి.మమత, ఏఎస్ఎం డి.అనురాధ, ఉపాధ్యాయుడు బెండి ప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 నాణేల చెల్లుబాటుపై అపోహలొద్దు


ఖాతాదారులకు నాణేలు అందజేస్తున్న బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్

సీతంపేట : స్థానిక సీతంపేట ఇండియన్ బ్యాంకు వద్ద రూ.10ల నాణేల చెల్లుబాటుపై ఖాతాదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ మాట్లాడుతూ పది రూపాయల నాణేలు చెల్లవని చాలా రోజులుగా పుకారు ఉందన్నారు. దానిపై ప్రజల్లో, వ్యాపారుల్లో ఉన్న అపోహలు నివృత్తి చేసేందుకే ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్ట ప్రకారం రూపొందించి చెలామణీలోకి తీసుకొచ్చామన్నారు. ఎలాంటి లావాదేవీలకైనా ఈ నాణేలు వాడొచ్చని... అపోహలు, సందేహాలు వీడి పది రూపాయల నాణేలతో నిరభ్యంతరంగా లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు పది రూపాయాల నాణేలు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

25వ వార్డులో పడకేసిన పారిశుధ్యం


శాంతిపురం రోడ్‌లో చెత్త, వ్యర్థాలు

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డులో పారిశుధ్యం పడకేసింది. సీతంపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో... ఇచ్చట చెత్త వేయరాదు, వేసినచో రూ.1000ల జరిమానా అని ఫ్లెక్సీ ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులు అక్కడే చెత్త వేస్తున్నారు. ఇక్కడి పరిస్థితి చూస్తే ఇంటింటా చెత్త సేకరణ ఏ స్థాయిలో జరుగుతుందో ఇట్టే ఊహించవచ్చు. వార్డులో పారిశుధ్య పర్యవేక్షణకు ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఐదు సచివాలయాల్లో ఐదుగురు శానిటేషన్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, వీరి కింద పదుల సంఖ్యలో వర్కర్లు ఉన్నా పారిశుధ్యం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు నిత్యం దర్శనమిస్తున్నాయి. శాంతిపురం రోడ్‌లో నిత్యం పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోతోంది. ఇదే రోడ్‌లో స్కీం బిల్డింగ్‌ల సమీపంలో గతంలో డంపర్‌బిన్ ఉండేది. దాన్ని తొలగించడంతో చుట్టు పక్కల వారు రోడ్‌పై చెత్త పడేసి వెళ్లిపోతున్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు జోన్ – 3లోని అన్ని వార్డులకు బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేసే అదనపు బాధ్యత అప్పగించడంతో దానిపై దృష్టిపెట్టి, పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే క్యాన్సర్ నివారణ


క్యాన్సర్ నివారణ మార్గాలపై కరపత్రాలు ప్రదర్శిస్తున్న డాక్టర్లు

మురళీనగర్ : క్యాన్సర్ లక్షణాలు ప్రాథమిక దశలో గుర్తించి అప్రమత్తంగా ఉంటే నివారించవచ్చని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్లు డాక్టర్ నమిత, డాక్టర్ లత అన్నారు. మురళీనగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వద్ద హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ నోటి క్యాన్సర్‌తోపాటు మహిళలు సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 200 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ మార్గాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు స్వర్ణలత, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం


రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న నగర పోలీసులు

తాటిచెట్లపాలెం : నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్స్ సహాయంతో విశాఖపట్నం రైల్వేస్టేషన్ పరిసరాల్లో 10.560 కేజీల గంజాయి పట్టుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రైల్వే స్టేషన్‌లో స్నిఫర్ డాగ్స్ సహాయంతో తనిఖీలు నిర్వహించగా 10.560 కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

- విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఓ మిస్త్రి, సిబ్బందితో మంగళవారం తనిఖీలు నిర్వహించి 11 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బిహార్ రాష్ట్రంలోని ముజఫర్‌పూర్ ప్రాంతానికి చెందిన రాజేష్ సహాని అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ ఎస్ఐ రామారావు తెలిపారు.

గుడ్డు లేకుండానే మధ్యాహ్న భోజనం

ఎన్ఎంసీహెచ్‌లో నిర్వాహకుల నిర్వాకం


గుడ్డు లేకుండా విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న సిబ్బంది

సీతమ్మధార : మధ్యాహ్న భోజన పథకం అమలు రోజురోజుకీ తీసికట్టు అన్నచందంగా తయారైందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సాక్షాత్తూ కలెక్టర్ పరిశీలించి పది రోజులు గడవకముందే పీ అండ్ టీ కాలనీలో గల ఎన్ఎంసీహెచ్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు లేకుండా వడ్డించడం గమనార్హం. సిబ్బందిని అడిగితే గుడ్లు రాలేదని చెప్పడం విశేషం. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 918 మంది వుండగా, ఇంటర్ విద్యార్థులు 57 మంది ఉన్నారు. వీరికి శనివారం మినహా రోజూ మధ్యాహ్న భోజనంలో విధిగా ఉడికించిన గుడ్డు ఇవ్వాల్సి ఉంది. మంగళవారం మధ్యాహ్నం మాత్రం పులిహోర, టమాటా కుర్మా మాత్రమే వడ్డించారు. కాంట్రాక్టర్ గుడ్లు సరఫరా చేయనందునే గుడ్లు ఇవ్వలేదని అంటున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్‌ని 'సాక్షి' వివరణ కోరగా గుడ్లు రానందునే ఇవ్వలేకపోయామన్నారు. గుడ్లు రాగానే అందజేస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇష్టారాజ్యంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

అందరి సహకారంతో హిందీ అభివృద్ధి

మహారాణిపేట: హిందీ భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నేవల్ డాక్‌యార్డు జనరల్ మేనేజర్ (మానవ వనరులు) కమొడోర్ అజమతుల్లా ఖాన్ కోరారు. ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డులోని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం హిందీ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. భారతీయ మత్స్య పరిశోధన సంస్థ విశాఖ కార్యాలయ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి మాట్లాడుతూ హిందీ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు వివరించారు.

కార్మికుల ఖాతాల్లో డబ్బులేయకుంటే సమ్మె చేస్తాం


ధర్నాలో సీఐటీయూ నాయకులు


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కుమార్


ధర్నాలో పాల్గొన్న జీవీఎంసీ కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ కార్మికుల జీతాల నుంచి ఆదాయపు పన్ను పేరుతో చట్ట విరుద్ధంగా కట్ చేసిన డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ పార్కు వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల నుంచి కట్ చేసిన డబ్బులు ఎస్ఎల్ఎఫ్‌లో ఉంచడం అన్యాయమన్నారు. కట్ చేసిన మూడు కోట్ల రూపాయలను కార్మికుల ఖాతాల్లో జమ చేయకుంటే సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నేటికీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటమి తప్పదని హెచ్చరించారు. ధర్నా అనంతరం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో సీఐటీయూ నాయకులు చర్చలు జరిపారు. ఎస్ఎల్ఎఫ్ గ్రూపు సభ్యులతో చర్చించి కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు, ఉరుకూటి రాజు, ఎంవీ ప్రసాద్, జె.నాయుడు, గొలగాని అప్పారావు, బి.రత్నం, ఒమ్మి అప్పారావు, ఈశ్వరావు, ఈ.ఆదినారాయణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం


మాట్లాడుతున్న జగదీశ్వరరావు

మహారాణిపేట : భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.జగదీశ్వరరావు సూచించారు. ఆశీలమెట్టలోని కశ్యప్ డిగ్రీ కాలేజీలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు చెడు అలవాట్లకు బానిసలవకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెట్విస్ మేనేజర్ ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ యువతీయువకులు భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. దేశ నిర్మాణంతోపాటు వివిధ అంశాలు ఈ పోర్టల్‌లో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ఎస్.ఎ.బాబు, కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్.జ్యోత్స్నరెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మద్దిలపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆదేశాల మేరకు మహత్ కాలనీ పరిసర ప్రాంతాల్లో సిబ్బంది మంగళవారం ఫాగింగ్ చేశారు. వార్డు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

క్లుప్తంగా

అన్నసమారాధనలో మేయర్ దంపతులు


మాలధారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి దంపతులు

సీతంపేట : ఎరిమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పోర్టు ఆస్పత్రి కూడలి వద్ద అయ్యప్ప మాలధారులకు జరుగుతున్న అన్నసమారాధనలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయ్యప్ప దీక్షా స్వాములకు ఏటా అన్నసమారాధన చేయడం చాలా గొప్ప విషయమని ట్రస్టు నిర్వాహకులను కొనియాడారు. ముందుగా అక్కడి పీఠంలో అయ్యప్ప స్వామికి పూజలు చేశారు.

27 నుంచి ఉచిత నృత్య శిక్షణ శిబిరం

సీతమ్మధార : విశాఖ జిల్లాలోని బాల నృత్య కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ నెల 27 నుంచి రెండు నెలలపాటు బహుభాషా నృత్యాలలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తామని స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్.జానకి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర బాలలకు నృత్యంలో 20 ఏళ్లుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇప్పిస్తున్నామని తెలిపారు. ప్రతీ ఆదివారం సీతమ్మధారలో గల స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ శిక్షణ కేంద్రంలో రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 26లోగా 8522990123కి ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

వాయు సైనిక్ క్యాంప్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్, తదితరులు

సీతంపేట : ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంప్‌లో లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుల్లయ్య ఇంజినీరింగ్ ఎయిర్‌వింగ్ క్యాడట్లు ఎస్.భవ్య హారిణి స్కిట్ షూటింగ్‌లో కాంస్య పతకం సాధించారు. మరో క్యాడెట్ ఎస్.నవీన్ రేడియో కంట్రోల్ ఏరోబేటిక్స్‌లో రజత పతకం సాధించాడు. బి.మౌళి ప్రియ ఏరో మోడలింగ్ కంట్రోల్ లైన్ ఏరోబేటిక్స్‌లో పాల్గొనగా, కె.భాగ్యలక్ష్మి ఏపీ తెలంగాణ కాంటిజెంట్ కమాండర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ వారిని అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, ఫ్లైట్ లెఫ్టినెంట్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యత్వం స్వీకరిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మంగళవారం క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురామరాజు, తదితరులు పాల్గొన్నారు.